www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 జనవరి 2024
5
వైఎస్ఆర్



ఎన్నికలకు ముందస్తుగా సన్నద్ధం కావాలి : కలెక్టర్

కడప : రానున్న ఎన్నికలను అధికారులందరూ సంసిద్ధం కావాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని విసి హాలు లో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సూర్య ప్రవీణ్ చంద్,అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్, ఎస్‌పి తుషార్ డుడి, డిఆర్ఒ గంగాధర్ గౌడ్ లతో కలిసి వచ్చే సాధారణ ఎన్నికల నిర్వహణపై ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఇఆర్‌ఒలు, నోడల్ అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను పురస్కరించుకొని ఇప్పటికే ఇఆర్‌ఒలు, నోడల్ అధికారులకు విధులు కేటాయించామని చెప్పారు. వీటిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి తనకు పంపించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులకు కేటాయించిన విధులను నిబంధనల ప్రకారం చేపట్టవలసి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేల్,పులివెందుల ఆర్‌డిఒలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకట రమణ, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బద్వేల్ వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

- అభ్యర్థి ఎంపిక విషయంలో తకరారు
- ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డికి వ్యతిరేకంగా అసమ్మతి నాయకుల సమావేశం
- ఎమ్మెల్యే సుధాకు టికెట్ కేటాయిస్తే సహకరించం
- సమావేశంలో పోరుమామిళ్ల వైసిపి మండల నాయకులు విశ్వనాథరెడ్డి



అనుచర వర్గంతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

మరో రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సిఎం సొంత జిల్లాలో వైసిపిలో అసమ్మతి సెగ తగలుతోంది. ఇందుకు బద్వేల్ నియోజకవర్గంలో వైసిపి అసమ్మతి నాయకుల విభేదాలు తారాస్థాయికి చేరడమే నిదర్శనం. అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ నేతల గ్రూపు మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకు టికెట్ ఇవ్వొద్దంటూ ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి వ్యతిరేక గ్రూపు నాయకులు అధిష్టానం వద్ద పట్టుబట్టింది. ఇందులో భాగంగా సోమవారం పోరుమామిళ్లలో వైసిపి వ్యతిరేక గ్రూపు నాయకుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే సుధాకు టికెట్ ఇస్తే సహకరించబోమని తెగేసి చెప్పారు. నిన్నటి వరకు అంతర్గతంగా ఉన్న విభేదాలు ప్రస్తుతం బహిర్గతమయ్యాయి.

ఎమ్మెల్యే సుధాకు టికెట్ కేటాయిస్తే సహకరించబోం..

బద్వేల్ నియోజకవర్గం వైఎస్‌ఆర్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధాకు కేటాయిస్తే ఎటువంటి పరిస్థితుల్లో సహకరించబోమని వైఎస్‌ఆర్‌సిపి మండల నాయకులు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. బద్వేల్ నియోజకవర్గ వైఎస్‌ఆర్ సిపి అసమ్మతి నేతల సమావేశం వైఎస్‌ఆర్ సిపి మండల నాయకులు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో కలువ కట్ట సమీపంలోని ఆయన ఎస్టేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గ వైసిపికి నాయకత్వం వహిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అనుచరులు వ్యవహరిస్తున్న తీరుకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు విసిగిపోయారన్నారు. పూర్తిగా ఒంటెద్దు పోకడలతో వ్యవహరిస్తూ ఉన్నప్పటికీ పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తాము ఎంతో ఓపిక పట్టామన్నారు. 14 ఏళ్ల నుంచి ఎమ్మెల్సీ గోవిందరెడ్డి నిర్వాకంతో తాము రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా చెప్పలేనంత ఇబ్బందులు పడ్డామని చెప్పారు. డాక్టర్ సుధా ఎమ్మెల్యే అయిన తర్వాత తమకు, కార్యకర్తలకు బాధలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. ఆమె ఎమ్మెల్యే అయితే కట్టుబడుతూ తమల్ని ఎంత మాత్రం పరిగణలోకి తీసుకోలేదన్నారు. 2024లో నిర్వహించబోయే ఎన్నికల ఎమ్మెల్యే అభ్యర్థిగా నిర్ణయించారని ప్రకటించుకుని వారి అనుచరుల ద్వారా నియోజకవర్గంలో బాణసంచా కాల్చడం, కేకులు కట్ చేసుకుని స్వీట్స్ పంచి పెట్టు కోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి పార్టీ ఏమైనా పర్వాలేదు.. ఓడిపోయినా తన పంతం నెగ్గాలనే భావన కనిపిస్తుంది తప్ప అందరిని కలుపుకోవాలని ఆలోచన ఎంత మాత్రం ఉన్నట్లు కానరావడం లేదని ఆరోపించారు. గెలిస్తే ఒకటే మేలు.. ఓడితే రెండు మేలు అనే రీతిలో ఉన్నారని పేర్కొన్నారు. అందరిని కలుపుకుపోయి పార్టీని గెలిపించాలని స్పృహ ఏమాత్రం లేదన్నారు. ఒకవేళ మరోసారి ఎమ్మెల్యే టికెట్ సుధాకే ఇస్తే తాము పనిచేయలేమని చెప్పారు. ఆమోదయోగ్యమైన వ్యక్తిని ప్రకటించకపోతే కార్యకర్తల ఆలోచన మేరకు తమ భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, జడ్‌పి టిసిలు, మాజీ మండల అధ్యక్షులు, మాజీ జడ్‌పిటిసిలు, మండల స్థాయి నాయకులు, 24 మంది సర్పంచులు, 20 మంది ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమృత నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టరేట్ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రొద్దుటూరులో ఉన్న అమృత నగర్‌లో 15 ఏళ్ల కిందట పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అక్కడ మౌలిక వసతులను కల్పించడంలో పాలక ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు విఫలం చెందారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రొద్దుటూరు అమృతనగర్ కాలనీవాసులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద అమృత నగర్ స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని, స్థలాలు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో మూడవ రోజు రిలే దీక్షలు చేస్తున్న ప్రొద్దుటూరు అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోలేదని చెప్పారు. అందుకే కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టామని తెలిపారు. 2008లో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్థలాలు ఇచ్చారని, 2018లో 600 మంది పేదలకు స్థలాలుఇచ్చారని కానీ అక్కడ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమైనారని వాపోయారు. లక్షలు ఖర్చుపెట్టి బేస్ మట్టాలు వేసుకున్నారని, కొందరు ఇళ్లు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. పెట్టిన రెండు లక్షలు ఖర్చు వృధాగా ఏటిలో వేసినట్టు పోయిందని చెప్పారు. వీరంతా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అన్ని వార్డులలో నివాసం ఉన్నారని చెప్పారు. అమృతనగర్‌లో దాదాపుగా 2,300 మంది ఉన్నారని, స్థలాలు ఇచ్చి విద్యుత్, మంచినీళ్లు, రోడ్లు, హౌసింగ్ రుణాలు ఇవ్వడంలో ఆ పేదలను పట్టించుకోవడంలేదన్నారు. పేదవారికి మౌలిక వసతులు కల్పించకుండా చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. పేదలు వేసుకున్న బేస్ మట్టం జోలికి వస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అక్కడ కొందరు రాజముద్ర కలిగిన సీలు తయారు చేసుకుని దొంగ పట్టాలు తయారు చేస్తూ టీములుగా ఏర్పడి పేదవారిని బెదిరిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. ధర్నా అనంతరం గ్రీవెన్స్‌లో ఉన్న జాయింట్ కలెక్టర్‌ను కలిసి అమృత నగర్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ చారి, శివకుమార్, మనోహర్, దస్తగిరి రెడ్డి తోపాటు అమృత నగర్ కాలనీవాసులు వెంకటేష్, ప్రభాకర్, సుబ్బరాయుడు, పెంచల్ రెడ్డి, హసీనా, షాబిరా భాను, లతా పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌పై 'ఆంధ్ర' ఘనవిజయం

ప్రజాశక్తి - కడప




తలపడుతున్న ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ జట్లు

సి కె నాయుడు ట్రోఫీలో భాగంగా కడపలోని రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ జట్టుపై 9 వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. ఆంధ్ర బౌలర్లు టి. విజయ్, వై. వాసు బౌలింగ్‌లో విజృంభించి జట్టు గెలుపు కోసం దోహదపడ్డారు. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఛత్తీస్‌గఢ్ జట్టు 152 పరుగులు చేసింది. 5 వికెట్ల నష్టానికి 199 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 55.3 ఓవర్లలో 239 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆంధ్ర జట్టులోని ధరణి కుమార్ నాయుడు 88, వై. వాసు 52 పరుగులు చేశారు.ఛత్తీస్‌గఢ్ జట్టులోని దీపక్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 7 వికెట్లు తీసుకున్నాడు. 19 ఓవర్లు బౌలింగ్ వేసి అందులో 3 ఓవర్లు మేడిన్ వేసి 77 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసుకున్నాడు. వరుణ్ సింగ్ 3 వికెట్లు తీసుకున్నాడు. దీంతో ఆంధ్ర జట్టు ఛత్తీస్‌గఢ్ జట్టుకు ఫాలో ఆన్ ఇచ్చింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఛత్తీస్‌గఢ్ జట్టు 23.0 ఓవర్లలో 99 పరుగులకు ఆల్ అవుట్ అయింది. 13 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 2.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 13 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు రోజులపాటు జరగాల్సిన ఈ మ్యాచ్ ఒకటిన్నర రోజుకే ముగియడం విశేషం.

ఉద్యోగాల నోటిఫికేషన్ గడువు పెంచాలి

ప్రజాశక్తి-కడప అర్బన్



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న నాయకులు

ఇటీవల నూతనంగా ప్రారంభించిన మానసిక, కేన్సర్ ఆస్పత్రుల్లో విడుదల చేసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నోటిఫికేషన్ గడువు పెంచాలని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్‌ను వైఎస్ ఆర్‌టియుసి నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ప్రిన్సిపల్‌ను కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్‌లో గడువు చాలా తక్కువ ఇచ్చారని పేర్కొన్నారు. 4 నుంచి 10 వ తరగతి స్టడీ సెర్టిఫికెట్స్‌ను జతపరచాలానే నియమం ఉన్నందున, కుల ధ్రువీకరణ పత్రం కావాలన్న కనీసం 3 నుంచి 5 రోజులు సమయం పడుతుందని చెప్పారు. 5 రోజుల గడువులో మూడు రోజులు సెలవులు రావడం వల్ల అభ్యర్థులు సమయం సరిపోక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకుని నోటిఫికేషన్ సమయాన్ని కనీసం 10 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. సమయం పెంచాలన్న విషయంలో ప్రిన్సిపల్ సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంగలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రాయల్ , ఉపాధ్యక్షుడు నరసింహ పాల్గొన్నారు.

ప్రయివేట్ బిఇడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్ : బిఇడి ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు కౌన్సెలింగ్ పూర్తి కాక మునుపే ఇష్టానుసారంగా మేనేజ్మెంట్ సీట్లు భర్తీ చేశారని పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి జి. శ్రీనాథ్ యాదవ్, డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎస్.షాకీర్,పిడియస్ యు నగర కార్యదర్శి గణేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగుతున్న బిఇడి ప్రయివేట్ కళాశాలలు కౌన్సెలింగ్ అడ్మిషన్ ప్రక్రియ పూర్తికాకమునుపే మేనేజ్మెంట్ సీట్లు భర్తీ చేశారని పేర్కొన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర రాష్ట్రాలైన ఒడిశా, పశ్చిమబెంగాల్, బీహార్ చెందిన విద్యార్థులను చేర్చుకుంటున్నారని తెలిపారు. కళాశాలలకు కనీసం బోర్డులు కూడా పెట్టకుండా నిర్వహిస్తున్నారని వాపోయారు. యోగి వేమన విశ్వవిద్యాలయం విసి చింతా సుధాకర్‌కు పలు మార్లు పిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం స్పందించి విసి పై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మదన్, రెడ్డి వరప్రసాద్, శ్రీకాంత్, గిరిధర్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అన్నదానం

కడప : సేవ చేయాలనే ఒక మంచి దృఢ సంకల్పంతో కడప సిఎస్ఐ స్కూల్ 1978వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నగరంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద మనోహార్ ఉష, స్టీవెన్, రాజ కుమారి, నిర్మల జ్యోతి, పరం జ్యోతీ ఆధ్వర్యంలో సోమవారం పేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాన్ బాషా మాట్లాడుతూ పేద ప్రజలకు అన్నదానం చేయడం ఎంతో పుణ్య కార్యక్రమం అన్నారు. ప్రతి ఒక్కరూ అన్నదానం చేయడం వల్ల ఎంతో మందికి కుడుపునిండా భోజనం పెట్టవచ్చు అన్నారు. రాబోయే రోజుల్లో పేదలకు ఉపయోగపడేలా మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించబోతున్నమన్నారు. కార్యక్రమంలో వీజం రఫీ, సుకుమార్, శ్రీనివాసులు, కరీం,శ్రీను ఫారెస్ట్, శీను, ఉస్మాన్ ఖాన్, రఫిద్దిన్ పాల్గొన్నారు.

వృత్తి విద్యలో రాణించాలి

కాశినాయన : విద్యార్థులు వృత్తి విద్యలోనూ నైపుణ్యత సాధించాలని ఎపి మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య పేర్కొన్నారు సోమవారం నర్సాపురంలోని ఎపి మోడల్ పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులను ప్రిన్సిపల్ సౌజన్య ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్‌లో భాగంగా కడపలోని కెఎల్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలను సందర్శించారు. ఐటి ఎలక్ట్రానిక్ కోర్సులను చదవడం ద్వారా కలిగే లాభాలను ఉపయోగాలను యాజమాన్యం వారికి క్లుప్తంగా వివరిస్తారన్నారు. ఒకేషనల్ కోర్సు చదవడం వల్ల ఉన్నత విద్య తొందరగా ఉద్యోగాలు వచ్చేందుకు ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

విద్యుత్ బిల్లులను తగ్గించాలి

కడప : పెరిగిన విద్యుత్ బిల్లులను తగ్గించాలని, విద్యుత్ వినియోగదారుల సమ స్యలను పరిష్కరించాలని పులివెందుల బోనాల నుంచి వినియోగదారుడు రమణారెడ్డి తన అభిప్రాయాలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి వారికి తెలియజేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరమునకు వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలు, ఐదవ నియంత్రణ కాలానికి ప్రతిపాదించిన పంపిణీ వ్యాపారానికి ఆదాయ అవసరాలు, వీలింగ్ ధరలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ విచారణ నిర్వహించారు.

'ఉక్కు' శంకుస్థాపనలకే పరిమితం


- జగన్ మారారు..చేసిన మేలు మరిచారు
- వైసిపి కోసం నిస్వార్థంగా పని చేశా
- ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పిసిసి అధ్యక్షులు షర్మిల



ఇడుపులపాయలోని వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న షర్మిల, సునీత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప/వేంపల్లె/ఖాజీపేట

కడప ఉక్కు పరిశ్రమను శంకుస్థాపనలకే పరిమితం చేశారని పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల విమర్శించారు. సోమవారం కడప నగర శివారులోని జయరాజ్ గార్డెన్‌లో పిసిసి మీడియ చైర్మన్ తులసిరెడ్డి అధ్యక్షతన కడప, అన్నమయ్య జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ తన తండ్రి వైఎస్సార్ బ్రతికి ఉంటే కడప జిల్లాకు కడప పరిశ్రమ వచ్చేదన్నారు. ఈ పరిశ్రమ వల్ల 20 వేల ఉద్యోగాలు వచ్చేవి, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి దొరికేదని తెలిపారు ఉక్కు పరిశ్రమ ఒక కలగానే మిగిలిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కడప స్టీల్ ప్రాజెక్టను విభజన హామీల్లో పెట్టింది, చంద్రబాబు రూ.18 వేల కోట్లతో మళ్ళీ శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. బాబు 5 ఏళ్లలో కడప స్టీల్ పై నిర్లక్ష్యం వహించారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతగా జగన్ దీక్షలు కూడా చేశారని ముఖ్యమంత్రి అయ్యాక జగన్ రెండు సార్లు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. కడప స్టీల్‌ను శంకుస్థాపన ప్రాజెక్ట్‌గా మార్చారని విమర్శించారు. నాన్న రాజశేఖర్‌రెడ్డి రక్తమే నా ఒంట్లో ప్రవహిస్తుందన్నారు. పులి కడుపున పులే పుడుతుందన్నారు. మార్క్ రాజకీయాలకు వైయస్సార్ కేరాఫ్ అడ్రస్ అని పేర్కొన్నారు. కడప నా పుట్టినిల్లు, జగన్ లాగే నేను ఇక్కడే పుట్టానని తెలిపారు. జగన్ అప్పటి మనిషి కాదన్నారు. ఇప్పటి జగన్‌ను ఎప్పుడూ చూడలేదన్నారు. వైసిపి కోసం నిస్వార్థంగా పనిచే శానని తెలిపారు. కార్యక్రమంలో సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కొప్పుల రాజు, పల్లంరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి జెడి. శీలం, కడప జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు అల్లా బకాష్, కాంగ్రెస్ పార్టీ కడప నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, బండి జకరయ్య, ప్రభాకర్, గొల్లు కృష్ణారావు, మాజీ మంత్రి అహ్మదుల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాజేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, రాష్ట్ర మహిళా అధ్యక్షులు తాంతియా కుమారి పాల్గొన్నారు.



మాజీ మంత్రి డి.ఎల్. రవీంద్రారెడ్డితో మాట్లాడుతున్న షర్మిల

ఇడుపులపాయలో షర్మిలతో సునీత భేటీ

వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలంలోని ఇడుపులపాయలో బస చేసిన పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలతో మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ వైఎస్.సునీత భేటి అయ్యారు. సోమవారం ఉదయం సునీత హైదరాబాద్ నుంచి నేరుగా ఇడుపులపాయకు చేరుకొని తన సోదరి షర్మిలతో భేటీ అయ్యారు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధి వద్దకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో కలిసి షర్మిల, సునీత వెళ్లి వైఎస్ఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. షర్మిలతో సునీత రెండు పాటు గెస్ట్‌హౌస్‌లో భేటి అయ్యారు. వారివురు భేటి కావడంతో సునీత కాంగ్రెస్‌లో చేరుతారనే వాటిపై రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ భేటీలో కీలకమైన అంశాలు మాట్లాడినట్లు తెలిసింది. ముందు నుంచి వివేకా హత్యలో పోరాడుతున్న సునీతకు షర్మిల మద్దతు పలుకుతూనే ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల, కడప నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన వ్యక్తిని నిలబెట్టేందుకు కాంగ్రెస్ అధిష్టానం చూస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో షర్మిలను వివేకా కుమార్తె సునీత కలవడం చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్ కుటుంబానికి దూరంగా ఉన్న సునీత ఇప్పుడు షర్మిలని కలవడం రసవత్తర రాజకీయానికి తెరలేపి నట్లయింది. వైఎస్ఆర్‌కు నివాళులర్పించిన అనంతరం షర్మిల కాంగ్రెసు పార్టీ విస్తత సమావేశానికి కడపకు వెళ్లాగా, సునీత పులివెందులకు వెళ్లారు. **మాజీ మంత్రి డిఎల్‌ను కలిసిన షర్మిల..** ఖాజీపేటలో మాజీ మంత్రి డాక్టర్ డి.ఎల్ రవీంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టనున్న చర్యల్లో భాగంగా డియల్ రవీంద్రారెడ్డిను కలిశానని చెప్పారు. రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని, పార్టీని బల పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు మద్దతు కోరేందుకు తాను వచ్చానని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. **షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విజయ జ్యోతి** బద్వేలు నియోజ కవర్గానికి చెందిన విజయ జ్యోతి సోమవారం జయరాజ్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయజ్యోతికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఆకృతి వస్త్ర దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

- రూ.3.40 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రొద్దుటూరులోని ఆకృతి దుస్తుల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం జరి గింది. షార్ట్ సర్క్యూట్ కార ణంగా కొర్రపాడు రోడ్డులోని ఆకృతి షాపింగ్ మాల్‌లో ఈ అగ్నిప్రమాదం సంభవి ంచింది. సుమారు రూ. 3.40 కోట్ల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు దుకాణ యజమాని హరికృష్ణ పేర్కొన్నారు. వివరాలు.. దుకాణం మూడంతస్తుల భవనంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపు రెండున్నర గంటలకు పైగా అగ్నిమాపక సిబ్బంది శ్రమించి షాపింగ్ మాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్లను మంటలు ఆర్పేందుకు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్ ఆధ్వర్యంలో తీసుకొచ్చారు. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ సిబ్బంది లీడింగ్ ఫైర్ మాన్ సాంబశివారెడ్డి పొగ ధాటికి స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే ఆ సిబ్బంది అప్రమత్తమై హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చీరలు, డ్రెస్ మెటీరియల్స్ రూ.2. 20 కోట్లు, ఫర్నీచర్, ముందుభాగాన ఉన్న గాజుగ్లాసులు రూ. 1.20 కోట్లు, మొత్తం రూ. 3.40 కోట్ల మేర నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు.

ప్రజల నాడి తెలుసుకుని మాట్లాడాలి : సిఆర్‌సి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్ ప్రజల నాడి తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని ఎంఎల్‌సి రామచంద్రయ్య అన్నారు. సొంత ఇంటి వారే జగన్‌కు వ్యతిరేకంగా ఉన్నారంటే ఆయన పాలన ఎంత దివాలకోరుతంగా ఉందో అర్థం చేసుకోవాలని చెప్పారు. ఇంటలిజెన్సీ, సిఐడి ద్వారా ప్రజలు ఏమంటున్నారో సమాచారం తెచ్చుకుంటే వాస్తవాలు తెలుస్తాయని హితవు పలికారు. సోమవారం కో-ఆపరేటివ్ కాలనీలోని ఆయన నివాసం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భజనపరులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. వినసనకర పాలనలో తాను భాగస్వామ్యం కాకూడదని బయటకు వచ్చానని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి నేతలు శ్మశానాలను కూడా వదలడం లేదని తెలిపారు. స్పీకర్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకుండా పార్టీ నాయకుడిగా పని చేస్తున్నారని విమర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ కన్నా లక్ష్మినారాయణపై అంబటి రాంబాబు దాడి చేయించారని, దీనిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- కడప

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి. ఓబులు పేర్కొన్నారు. సోమవారం కడప ప్రావిడెంట్ ఫండ్ ప్రాం తీయ కార్యాలయం ఎదుట ఎంప్లాయిస్, వర్కర్స్ యూని యన్ (సిఐటియు అనుబం ధం) అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం కమిషనర్‌గా వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఓబులు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో శ్రీ నీలకంఠాపురం శ్రీరామ్‌రెడ్డి వాటర్ ప్రాజెక్టులో రాయదుర్గం, కళ్యాణ్ దుర్గం, మడకశిర, హిందూపురం, పిఎబిఆర్ హెడ్ వర్క్‌లో సుమారు 600 మంది కార్మికులు 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని చెప్పారు. వారికి వేతనంతో పాటు పిఎఫ్ చెల్లించాలని చట్టం ఉన్నప్పటికీ 2022, ఏప్రిల్ నుంచి కాంట్రాక్టర్ శివారెడ్డి తొమ్మిది నెలలుగా పిఎఫ్ కట్టలేదని వాపోఆయరు. 2021 - 22 సంవత్సరానికి గాను కాంట్రాక్టర్ కలం నాయుడు ఐదు నెలల పిఎఫ్ కట్టలేదన్నారు. కాంట్రాక్టర్లు కట్టనప్పుడు ప్రిన్సిపల్ ఎంప్లాయ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పీఎఫ్ చెల్లించాలని కార్మిక చట్టాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ, కాంట్రాక్టర్లు కుమ్మకు కావడం వల్ల కాంట్రాక్టర్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమలో జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి మనోహర్, మెడికల్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అనంతపురం జిల్లా శాఖ అధ్యక్షులు ఎర్రి స్వామి, జిల్లా కార్యదర్శి రాము, ఉపాధ్యక్షులు ప్రభాకర్, జిల్లా యూనియన్ ట్రెజరర్ వన్నూరుస్వామి, జిల్లా యూనియన్ కమిటీ సభ్యులు అశోక్ పాల్గొన్నారు.

పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు తీర్చాలి

కడప అర్బన్ : సుదీర్ఘ కాలం ప్రజలకు, ప్రభుత్వాలకు వారధులుగా నిలచి, ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ పెన్షనర్స్‌ను తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కించే పరిస్థితిని తేవడం ఏ ప్రభుత్వానికి మంచిది కాదని రాష్ట్ర జెఎసి ఉప కార్యదర్శి హృదయరాజు అన్నారు. సోమవారం 300మంది పైగా పెన్షనర్లు జిల్లాలోని నలుమూలల నుంచి వయస్సును, ఆరోగ్యాలను లెక్కచేయకుండా వచ్చి నినాదాలే ఆయుధాలుగా ప్ల కార్డులు చేతబట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రతినెలా1న పెన్షనర్స్‌కు పెన్షన్ మంజూరు చేయమని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి సమావేశాల్లో పలుమార్లు చెప్పినప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షులు చెన్నారెడ్డి మాట్లాడుతూ తగ్గించిన క్వాంటమ్ పెన్షన్‌ను పెంచాలని పేర్కొన్నారు. డిఆర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధా కృష్ణ మాట్లాడుతూ గుర్తింపు పొందిన అన్ని అసుపత్రులలో ఇహెచ్‌ఎస్ కింద క్యాష్ లెస్ ట్రీట్ మెంట్ అందించాలని తెలిపారు. పరిమితిని రూ.5లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎన్ జి ఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఇలియాస్, రమణారెడ్డి, సంఘమేశ్వర్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ మస్తాన్, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, పెద్దన్న, బాలయెల్లారెడ్డి, వెంకట య్య, లక్ష్మన్న, దేవదానం, బ్రహ్మయ్య, కొండారెడ్డి తదితర నాయకులు సమ స్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రాన్ని అందించారు.

హామీలు అమలు చేయాలి

కడప అర్బన్ : గత నెల 26 నుంచి ఈనెల 12 వరకు నిర్వహించిన సమ్మెకు సంబంధించి ప్రభుత్వ పెద్దలకు, కార్మిక సంఘ నాయకులకు నిర్వహించిన చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మెకాలాన్ని రద్దు చేస్తూ జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త జీతం అమలు చేయాలని కోరారు. కోవిడ్ సమయంలో పని చేసిన కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని పేర్కొన్నారు. సెలవు విషయాలను పరిశీలించాలని చెప్పారు. కార్యాలయం ఎదుట వసతి, క్యాంటిన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగులకు జిపిఎఫ్ అకౌంట్ తెరవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే జిఒలు విడుదల చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరుతూ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సుంకర రవి, తిరుపాల్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, నాగరాజు, సిహెచ్ కొండయ్య, సుంకర కిరణ్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరికలు

కడప అర్బన్ : కడపలోని జోనల్ వర్క్‌షాప్‌లో ఉన్న వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌లోని సభ్యులందరూ ఆ యూనియన్‌కు మూకుమ్మడి రాజీనామాలు సమర్పించి మొత్తం సభ్యులందరూ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. జోనల్ వర్క్‌షాప్ కాంప్లెక్స్‌లో ఏకైక యూనియన్‌గా ఎంప్లాయిస్ యూనియన్ అవతరించింది. కార్యక్రమం నాన్ ఆపరేషన్ రీజనల్ కార్యదర్శి అంకిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జోనల్ ఉపాధ్యక్షులు నారాయణ, రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి నాయక్, మూడు యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు వల్లూరు సుబ్బారెడ్డి, కెపివి ఎస్.రెడ్డి, సుబ్బయ్య, చెంద్రాయుడు, జయాకర్, పుల్లన్న నాయకులు, కాంప్లెక్స్ లోని మొత్తం ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతూ ఉందని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు విమర్శించారు. సోమవారం రహమతీయ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా వైఫల్యాలను ఎండగడుతూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దోపిడీకి గురవుతూ మానప్రాణాలను రక్షణ లేకుండా పోతుందని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధనార్జనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో పాలకొండ గుడి మాజీ చైర్మన్ ఓబుల్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్, 6వ డివిజన్ సీనియర్ నాయకులు మామిళ్ళ శివ, ఉక్కాయ పల్లె రాజన్న యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జాగా.. వేసేయ్ పాగా..

రెవెన్యూ అధికారుల సహకారంతోనే భూ కబ్జాలు - ఎడాపెడా అక్రమ కట్టడాలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కొందరు భూ అక్రమార్కులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు అండ ఉండగానే ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకోవాలనే తాపత్రయంతో వారి అరాచకాలు శృతి మించిపోతున్నాయి. గత నెల రోజుల నుండి కబ్జాదారుల అరాచకాలు పెరిగిపోతున్నాయి. భూ అక్రమార్కులను రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల అక్రమ వ్యవహారంలో రెవెన్యూ శాఖ అధికారులు భాగస్వాములైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని గూడెంచెరువు పంచాయతీలో రాజీవ్ కాలనీ సమీపంలో ఇటీవలే 92 మంది పేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి జగనన్న పట్టాల పంపిణీ చేశారు. పట్టాల పంపిణీ కార్యక్రమం ముగిసిన వెంటనే కబ్జాదారుల కన్ను ఆ ప్రాంతంపై పడింది. అత్యంత విలువైన ఈ భూమిని కబ్జాదారులు ఆక్రమిస్తున్నారు. ఒక సెంటు భూమి రెండు నుండి మూడు లక్షలు విలువ చేస్తుంది. రాజీవ్‌నగర్ నివాస ప్రాంతాలకు పక్కన ఉండడంతో భూమి ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో భూ అక్రమార్కులు ఒక్కసారిగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలను కట్టేందుకు జెసిబిల సాయంతో పనులు చకచకా సాగుతున్నాయి. ఇంకా రెవెన్యూ అధికారులు జగనన్న పట్టాల పంపిణీ చేసిన వారికి స్థలాలను కేటాయించలేదు. ఈ భూ అక్రమ వ్యవహారంలో స్థానిక రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వారి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం అంతా సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ పార్టీకి చెందిన కార్యకర్తలు విలువైన భూమిని దాదాపు 50 సెంట్ల మేర కబ్జా చేసి నిర్మాణాలను సైతం సాగిస్తున్నారు. ఆ గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని సమాచారం. భూ కబ్జాదారులకు రెవెన్యూ అధికారుల సహకారం ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





స్థలాన్ని ఆక్రమిస్తున్న భూ కబ్జాదారులు, ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన బేస్ మట్టాలు

అక్రమ కట్టడాలను కూల్చేస్తాం

రాజీవ్ కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం. ప్రత్యేకంగా రెవెన్యూ అధికారులతో ఓ బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తాం. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుంది. కబ్జాకు గురైన ప్రాంతాన్ని అంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

- గురప్ప, తహశీల్దార్, జమ్మలమడుగు



పాదయాత్ర నిర్వహిస్తున్న భూపేష్‌రెడ్డి

రాజోలు ముంపు బాధితులకు అండగా ఉంటా

ప్రజాశక్తి - పెద్దముడియం

రాజోలు ముంపు బాధితులకు అండగా ఉంటానని జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. రాజోలి ప్రాజెక్టు భూ నిర్వాసితుల పరిహారం కోసం సోమవారం ఆయన పాదయాత్ర చేపట్టారు. జమ్మలమడుగు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీ వాహన శ్రేణి మధ్య పెద్దముడియం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. భారీ సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలతో పెద్దముడియంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి పాదయాత్రను ప్రారంబించారు. పాలూరు, చిన్నముడియం, ఘర్షలూరు గ్రామాల మీదుగా నెమల్లదిన్నె గ్రామంలో బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. ముంపువాసుల పరిహారం సాధించే విషయంలో వారికి అండగా ప్రభుత్వంతో పోరాడేందుకు ఎంతవరకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, నాయకులు రమణారెడ్డి, జనసేన నియోజక వర్గ కార్యదర్శి నాగార్జున, అధ్యక్షులు అల్లం సూరి, నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌వి దిగజారుడు రాజకీయాలు : బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాజకీయ అవసరాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నీచస్థితికి దిగజారుతున్నారని పులివెందుల నియోజకవర్గ టిడిపి అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల వైస్ కుటుంబాన్ని చీల్చారని, అందుకు సాక్షంగా వైయస్ విజయమ్మ, దేవుడేనని చెబుతున్నారని, రాజకీయ అవసరాల కోసం జగన్మోహన్‌రెడ్డి విజయమ్మతో కూడా తప్పుడు సాక్ష్యం ఇప్పించే పరిస్థితి ఉందన్నారు. దీన్ని ఆమె గ్రహించాలని సూచించారు. పులివెందులలో తమ సొంత కార్యకర్తలకు డబ్బులు ఇచ్చే పరిస్థితికి వైసిపి దిగజారిందని తెలిపారు. వైసిపి కార్యకర్తలు తమకు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. టిడిపి నాయకుల వల్ల తమను ఇప్పుడు వైసిపి నాయకులు గుర్తించి డబ్బులు, వర్కులు ఇస్తున్నారని అంటున్నారని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి ఓటు వేయండి

పులివెందుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం బయమ్మతోట ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట్లోని మహిళలకు తెలుగుదేశం పార్టీ చేపట్టనున్న పథకాల కరపత్రాలను లతారెడ్డి వివరించి చెబుతున్నారు. మరోవైపు బీటెక్ రవి ప్రచారాన్ని సాగిస్తున్నారు. టిడిపి నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, వెంకట్రా మిరెడ్డి, కాశీంవలి, మహబూబ్ బాషా, వెంకటాపురం లక్ష్మీదేవి, రమీజా, పిరమ్మ పాల్గొన్నారు.

వరి పంట ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రస్తుత సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి పంట ఎండిపోకుండా రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కడప కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాస ఆచారి, భగవతి ప్రియ సూచించారు. పల్లవోలు, ఖాదరపల్లె, సీతారామాపురం గ్రామాల పరిధిలో ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ అధికారి మ్యాగీ ఆధ్వర్యంలో సోమవారం వారు పరిశీలించారు. వరి పంట ఎండిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దెబ్బతిన్న పంటలను పరిశీలించామని శాస్త్రవేత్తలు తెలిపారు. వరి పొలాల్లో రెండు సెంటీమీటర్ల వరకు నీటిని నిలువ ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నీటిని పూర్తిగా తీసేయవద్దన్నారు. పంట పొలాల్లోని నీటిని పరీక్షల నిమిత్తం సేకరించి ల్యాబ్‌కు తరలిస్తున్నామన్నారు. జిల్లా డిఆర్‌సి డిఎ రమణారెడ్డి, ఎఫ్‌టిసి ఎఒ పద్మజా, శివశైలజ, మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి, విఎఎలు గోపీరామ్, గిరిధర్‌రెడ్డి, సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

15లోపు పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీలో సాగు చేసిన అన్ని పంటలను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని ఇకెవైసి చేయించుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ పంట నమోదు కాకపోతే ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలు రైతులకు వర్తించవన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు ఫోన్ నెంబర్ ద్వారా ఒటిపి తెలిపి ఇకెవైసి చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 15లోపు ప్రతి రైతు తప్పకుండా పంట నమోదుతోపాటు ఇకెవైసి చేయించుకోవాలని ఎఒ కోరారు.

జీవాలకు నట్టల నివారణ మందు

ముద్దనూరు : గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు మందు, ఆకలి మందగించిన పశువులకు లివర్ టానిక్ తాగించాలని ముద్దనూరు పశువైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వాసా శ్రీనివాస సూచించారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో సోమవారం వాటర్ షెడ్ వారి సహకారంతో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాస ఉచిత పశు వైద్య శిభిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రాజు, సిబ్బంది సూర్యబాబు, రామచంద్రారెడ్డి, పార్థసారధి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- ఎస్ఐ అనిల్‌కుమార్

సింహాద్రిపురం : మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. రేణిగుంట రైల్వే నుంచి సోమవారం ఆయన బదిలీపై సింహాద్రిపురం వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు చిన్నచిన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, గొడవలకు వెళ్లొద్దని ఆయన సూచించారు

మున్సిపల్ కమిషనర్‌గా రమణారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా జి.రమణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిపాలన అధికారిగా బదిలీ అయ్యారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్న రమణారెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ పులివెందుల పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రొద్దుటూరుకు మల్లికార్జున..

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున సోమ వారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధి, పట్టణ సుందరీకరణకు కృషి చేస్తామన్నారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ కమిషనర్ నేతృత్వంలో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు.

పలువురికి వీరశివారెడ్డి పరామర్శ

ఎర్రగుంట్ల : మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి సోమవారం పట్టణంలోని 9వ వార్డు వైసిపి కౌన్సిలర్ భర్త దేరంగుల వెంకటేష్ (కల్లె) అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయన ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీనియర్ రిపోర్టర్ సదాశివారెడ్డికి కాలు విరగడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్యంపై తగు సూచనలిచ్చారు. ఆయన వెంట మాజీ మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ మల్లు గోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు లాడ్జి అంకిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, అంకాల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, శివశంకర్ ఉన్నారు.



గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు

జగన్ పాలనను ఓర్వలేకే టిడిపి విమర్శలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సిఎం జగన్ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేకే తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలం పరిధిలోని మోరగుడి గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ కనుసన్నల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులకే సంక్షేమ పథకాలు అందే వన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ.. రాను న్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజల ను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గుద్దేటి హరిత, హస్త కళల చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, ఎంపిటిసి ఆరవేటి బాబు, మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, బడిగింజల చంద్రమౌళి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సర్వేతో ప్రజల జీవన విధానం తెలుసుకోవచ్చు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజల జీవన విధానం తెలుసుకునేందుకు విద్యార్థులతో సర్వే చేయిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక మదీనాపురంలో చేస్తున్న సేవా కార్యక్రమం సోమవారం 5వ రోజుకు చేరుకుంది. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి విద్యార్థులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో ప్రజలుకు అందుతున్న ఉపాధి, విద్యపట్ల శ్రద్ధపై తెలుసుకున్నామన్నారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక, ఆర్థిక అంశాలను తెలుసుకోవడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటిన ఎర్రగుంట్ల విద్యార్థులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

బెంగళూరులో ఈ నెల 27, 28 తేదీల్లో విఫా తైక్వాండో అండ్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన 6వ విఫా కప్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2024 జూనియర్స్ విభాగంలో.. ఇ.అభిలాష్, పి.ఎస్.షామీర్ హుస్సేన్, పి.దస్తగిరి బంగారు పతకం సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో.. ఎ.ఎం.డి.జీషాన్, పి.రెడ్డి సాకేత్, వై.యాఘణ్యహిత్‌రెడ్డి బంగారు పతకం, పి.యస్వంత్ వెండి పతకం సాధించారు. మహిళా విభాగంలో.. కీర్తన, రెడ్డి లక్ష్మి, వెంకటదీప్తి, శివగంగ బంగారు పతకం సాధించినట్లు సీనియర్ మాస్టర్ వి.సుమన్ బాబు, ఎర్రగుంట్ల కోచ్ జె.దినేష్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 300 మంది ఈ పోటీల్లో పాల్గొన్నట్లు వారు వివరించారు. గ్రాండ్ మాస్టర్ నాగూర్ మాస్టర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీల్లో శిక్షణ పొందుతున్నట్లు వివరించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

క్రైం కార్నర్

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న వనం బయమ్మ (43) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు బయమ్మ భర్త ఎర్రన్న మధ్య తరచూ కుటుంబ కలహాలు జరిగేవని, మనస్థాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంటిలోని కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులున్నారు. బయమ్మ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఈశ్వరయ్య తెలిపారు.

45 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన పిచ్చోళ్ల సుబ్బరాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 45 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేశామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే సిఎం లక్ష్యం



మెగా చెక్కును అందిస్తున్న ఎస్.నాగిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ప్రతి మహిళా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటూ, వారిని లక్షాధికారి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి తెలిపారు. స్థానిక యాసిన్ కల్యాణమండపంలో సోమవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.నారెడ్డి మాట్లాడుతూ 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు వైయస్సార్ చేయూత ద్వారా రూ.75,000 రుణాలు అందించారన్నారు. 2014లో చంద్రబాబు రుణమాఫీ చేస్తామని మహిళలను మోసగించారన్నారు. 762 సంఘాలకు సంబంధించి వైఎస్ఆర్ ఆసరా రూ.5.35 కోట్ల మెగా చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం ఐసిడిఎస్, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, వెలుగు సిసి లావణ్య, ఎపిఎం వెంకటరమణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మహబూబ్ బీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మరియమ్మ, వైసిపి మండల నాయకులు రామ్మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, బాల నరసింహారెడ్డి, శాంతరాజు, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు కిశోర్‌కుమార్ రెడ్డి, శ్రీనువాసులరెడ్డి, వెలుగు సిసిలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు .

అభివృద్ధి ముసుగులో భారీ అవినీతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే అభివృద్ధి పేరుతో అధికార పార్టీ నాయకులు భారీస్థాయిలో అవినీతి చేస్తున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కంబల్లె సమీపంలో మూగమూరు వంకపై చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై భారీగా నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. 2019లో రూ.110 కోట్లతో చేపట్టిన పనులను ఇప్పటి వరకు అరకొరగా మాత్రమే చేశారన్నారు. దీనిపై కలెక్టర్, పాడా ఒఎస్‌డి, ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి జిల్లా సమావేశాల్లో చర్చించామన్నారు. అయినా ఎలాంటి స్పందన లేదన్నారు. పులివెందుల నియోజవర్గానికి ఇప్పటివరకు ఎంత పాడా నిధులు మంజూరు అయ్యాయని అధికారులను కోరినా సమాచారం ఇవ్వ లేదన్నారు. పులివెందుల నియోజకవర్గం ప్రజలు ఆలోచించి జరగబోయే ఎన్నికల్లో ఓ చారిత్రాత్మక తీర్పు ఇవ్వాలని ఆయన ప్రజలకు సూచించారు.

అభివృద్ధి పురోగమనమా.. తిరోగమనమా..

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి ఇంతవరకు వరకు పులివెందుల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు పురోగమనమా.. లేక తిరోగమనమా దిశగా వెళుతున్నాయో అర్థంకాని పరిస్థితి అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ ఆయకట్టు ద్వారా ఒక్క ఎకరాకు కూడా నీరు అందించిన దాఖలాల్లేవన్నారు. అభివృద్ధి పనులపై ఎంతెంత ఖర్చు పెట్టారని అడిగితే సమాధానం ఇచ్చే నాధుడే కరువయ్యారని ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించి రైతులను ఆదుకుంటామన్న ప్రభుత్వం కనీసం లింగాల బ్రాంచ్ కెనాల్, పులివెందుల బ్రాంచ్ కెనాల్ ద్వారా ఒక ఎకరాకు కూడా నీరు అందించిన పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పటికైనా అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైసూరారెడ్డి, రమణారెడ్డి, గంగిరెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



సింహాద్రిపురం : మొగమూరు ప్రాజెక్టు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

'అభ్యర్థిని ప్రకటించడానికి వీరశివారెడ్డి ఎవరు?'



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి పార్టీలో చేరి 24 గంటలు గడవకముందే విలేకరుల సమావేశం పెట్టి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి సమక్షంలో ప్రొద్దుటూరు టిడిపి అభ్యర్థిని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా టిడిపి అధ్యక్షుడు లింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక అన్న క్యాంటీన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లాలోనే ప్రొద్దుటూరులో టిడిపి చాలా బలంగా ఉందన్నారు. అన్నిరకాల సామాజిక వర్గాలు ఇక్కడ టిడిపి నాయకత్వాన్ని కోరుకుంటున్నాయన్నారు. తానుకూడా ప్రొద్దుటూరు టిడిపి టికెట్ ఆశిస్తున్నానని లింగారెడ్డి తెలిపారు. తనతోపాటు సీఎం సురేష్ నాయుడు, ముక్తియార్, శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, ఉక్కు ప్రవీణ్, వరదరాజుల రెడ్డి టిక్కెట్ ఆశావహులుగా ఉన్నారన్నారు. వీరందరూ పార్టీకోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ఇలా ఎవరు పడితే వారు టికెట్లు ప్రకటించుకోవడం పార్టీ క్రమశిక్షణకు ఎదురు చెప్పడమేనన్నారు. పార్టీ టికెట్ ఇచ్చే సమయంలో అందర్నీ కలిసి మాట్లాడాకే ఇస్తామని అధిష్టానం చెప్పిందన్నారు. ఎవరికి టికెట్ వచ్చినా అందరం కలిసి పార్టీని గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీఎం సురేష్ నాయుడు, తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాజుపాలెం మండల మాజీ అధ్యక్షుడు శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాపారులను ఎమ్మెల్యే మభ్యపెట్టే ప్రయత్నం : ప్రవీణ్

ప్రజలను, వ్యాపారులను ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తప్పుడు వాగ్దానాలతో మరోసారి ఎమ్మెల్యే కావాలని చూస్తున్నారని తెలిపారు. ఆదివారం వ్యాపారులకు సంబం ధించిన కార్యక్రమానికి ఎంపీ అవినాష్‌రెడ్డి వస్తుంటే వాగ్దానాలు ఏమైనా పూర్తి చేశారేమో.. దానికి సంబంధించిన ప్రారంభోత్సవానికి వచ్చారేమోనని అనుకున్నామన్నారు. తీరా చూస్తే అసమ్మతి వైసిపి నేతలను బుజ్జగించేందుకు వచ్చారని తెలిసిందన్నారు. ప్రొద్దుటూరులో కార్పొరేట్ సంస్థ అయిన సిఎంఆర్ షాపింగ్ మాల్‌కు మున్సిపాలిటీలో ట్రేడ్ లైసెన్స్ ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. ట్రేడ్ లైసెన్సు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులకు తెలియకుండా ఇచ్చారా అన్నారు. కార్పొరేట్ సంస్థకు అనుమతులు ఇచ్చి ఈరోజు మళ్లీ మున్సిపాలిటీలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కూడా గాలి మేడలకు రిబ్బన్ కటింగ్ చేయడానికి వచ్చారన్నారు. రాబోయే తెలుగుదేశం అధికారంలో వ్యాపారస్తుల దగ్గర నుండి మామూళ్లుగానీ, దౌర్జన్యాలుగానీ ఉండవని హామీ ఇస్తున్నానన్నారు. తాను శాంతి ప్రొద్దుటూరు చేస్తానని, ఎమ్మెల్యే చెప్పే కళ్లబొల్లి మాటలను నమ్మొద్దని ప్రవీణ్ వ్యాపారులను కోరారు.

సింగపూర్‌గా మార్చిన ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం మండల కేంద్రాన్ని సింగపూర్‌గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేనని మండల ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో సోమవారం ఎంపిపి అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో దాదాపు వందల కోట్ల రూపాయలు నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డ్‌ను వినియోగంలోకి తెచ్చారన్నారు. రైతులకు అన్ని రకాలా ఉపయోగపడేలా మార్కెట్ యార్డ్ అందుబాటులో ఉందన్నారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఝాన్సీరాణి, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, పిఆర్ ఎఇ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎంఇఒ-2 శారద, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంత, ఉపాధి హామీ ఎపిఒ భారతి, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి

ఎంపిడిఒ కృష్ణమూర్తికి ఘన సన్మానం

ఎంపిడిఒ కృష్ణమూర్తిని మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయన చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.